క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు స్వామి వారి ప్రసాదం, బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శనివారం ఓ భక్తుడు రూ.25 వేలు విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. ఎమ్మిగనూరుకు చెందిన ఈక్షిత కుటుంబ సభ్యులు రూ.25వేలు ఆలయ కార్యాలయంలో అందజేయగా.. వారికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, శేషవస్త్రాలు, ప్రసాంద, బాండు అందజేశారు.

అధైర్యపడొద్దు

మంత్రాలయం రూరల్: మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన చిన్ననాగప్ప(45) శుక్రవారం కరెంట్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ యువనేత వై.ప్రదీప్‌రెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. మృతుడికి కుటుంబానికి రూ.15 వేల నగదును సాయంగా అందజేసి అండగా ఉంటామని, అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు.

ఆంజనేయస్వామికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండలంలోని సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయంలో, అగసలది న్నెలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారం కావడంతో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు వాయుపుత్రుడుకి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. బుడుములదొడ్డిలో సీతారాములకు పూజలు చేపట్టి ఉత్సమూర్తులకు రథంపై అధిష్టింపజేసి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

రాగిజావ తప్పనిసరిగా ఇవ్వాలి



విద్యార్థులకు రాగిజావ తాగిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ ప్రకాష్

మద్దికెర: పోషక విలువలు కలిగిన రాగిజావను వారానికి మూడుసార్లు విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని బురుజుల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. చిన్నారులతో పాటు రాగిజావ రుచి చూసి మెనూ ప్రకారం ఇస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఈఓ రంగారెడ్డి, ఎంఈఓ రంగస్వామి ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



రోగులతో మాట్లాడుతున్న ఎంపీహెచ్ఈఓ చలపతి

ఆలూరు రూరల్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కర్నూలు జిల్లా ఎంపీహెచ్ఈఓ(మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్) చలపతి అన్నారు. శనివారం ఆయన ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ప్రబలుతున్న విషజ్వరాల శీర్షికన ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అన్ని రకాలు మందులు ఉన్నాయా, లేదా అని డాక్టర్ లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు.

మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

కృష్ణగిరి: పదో తరగతి పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కర్నూలు డిప్యూటీ ఈఓ హనుమంతురావు హెచ్చరించారు. శనివారం ఆయన కృష్ణగిరి, కంబాలపాడులోని రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు.

పోషకాల రాగిజావ

- విద్యార్థుల్లో రక్తహీనత, క్యాల్షియం లోపాలను తగ్గించడమే లక్ష్యం
- మంగళ, గురు, శనివారాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో జావ పంపిణీ
- నియోజకవర్గంలో 127 ప్రభుత్వ పాఠశాలల్లో 18,144 మంది విద్యార్థులకు లబ్ధి
- ఆరోగ్య ప్రయోజనాలు అధికం
- వేసవిలో ప్రజలు రాగిజావపై దృష్టి పెట్టాలంటున్న వైద్యులు

విద్యావ్యవస్థలో రాష్ట్రప్రభుత్వం వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఒక పక్క నాడు–నేడు కింద బడులను తీర్చిదిద్దుతుండగా, మరో వైపు డ్రాపౌట్స్ తగ్గించేందుకు విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పేరుతో నాణ్యమైన, పౌష్టికాహారం అందజేస్తోంది. రోజూ మెనూ ప్రకారం వండి పెట్టేలా చర్యలు చేపట్టింది. నూతనంగా.. ఆరోగ్యకరమైన భవిష్యత్ తరాల కోసం విద్యార్థులకు రాగిజావ అందజేయాలని నిర్ణయించింది.



ఆర్ఆర్ లేబర్ కాలనీలో రాగిజావ కోసం క్యూలో నిల్చొన్న విద్యార్థులు

ఆదోని అర్బన్ : విద్యార్థులకు పోషకాలు అందించడంతో పాటు డ్రాప్ అవుట్స్ తగ్గించడంలో భాగంగా వారికి పాఠశాలల్లోనే రుచికరమైన పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనంలో అందజేస్తుంది. రోజువారి అందిస్తున్న మెనూతో పాటు పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి వారంలో ఐదు రోజులు గుడ్లు, మూడు రోజులు బెల్లం చిక్కీ ఇస్తున్నారు. అయినా కొందరు పిల్లల్లో ఐరన్, క్యాల్షియం లోపాలున్నాయనే సమాచారం మేరకు వాటి లోపం కూడా ఉండకూడదని ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి గత నెల 21వ తేదీ నుంచి రాగిజావ అందజేస్తోంది. బెల్లంచిక్కీ ఇవ్వని రోజుల్లో తగినంత ఐరన్, క్యాల్షియం అందించేందుకు రాగిజావ ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. మధ్యాహ్న భోజనంలో చిక్కీ ఇవ్వని రోజుల్లో అందుకు బదులుగా రాగిజావను మెనూలో చేర్చారు. నియోజకవర్గంలో 127 పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలవుతోంది. ఆయా పాఠశాలలో 18,144 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ప్రస్తుతం వారంలో మూడు రోజులపాటు చిక్కీ అందిస్తున్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో విద్యార్థులకు అందుతున్నాయి. మిగిలిన మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ పంపిణీ చేస్తున్నారు. దీంతో వారమంతా బడిలో బలవర్ధక ఆహారం విద్యార్థులకు అందుతోంది.

పోషకాలు అధికం..

తక్కువ ధరకే లభించడంతో పాటు తక్కువ సమయంలో తయారు చేసుకునే రాగిజావ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కోసం రాగిజావా తాగేందుకు ఇక్కడి ప్రజలు ఇష్టపడతారు. టీ, కాఫీలకు బదులుగా నేటికీ రాగి గంజి తాగుతున్నారు. రోజువారీ ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. మధుమేహం, బీపీ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. స్థూలకాయాన్ని నివారిస్తుంది. రోజూ రాగిజావా తాగినా, రాగిముద్ద తిన్నా ఆరోగ్యకరమైన ప్రయోజనాలు చేకూరుతాయని వైద్యులు చెబుతున్నారు. రాగుల్లోని పోషకాలు, ఫైబర్ వల్ల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని నిపుణుల సూచన మేరకు ప్రభుత్వం భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన యువతను అందించాలని జావ పంపిణీ చేస్తుంది.

చాలా రుచిగా ఉంది



వారం రోజులపాటు బలవర్ధక ఆహారం జగనన్న గోరుముద్ద కింద అందిస్తున్నారు. మూడు రోజులపాటు బెల్లం చిక్కీ, మరో మూడు రోజుల పాటు రాగిజావ ఇస్తున్నారు. జావ ఎంతో రుచికరంగా ఉంది. విద్యార్థుల గురించి జగన్ సార్ ఆలోచించడం సంతోషంగా ఉంది.
– చంద్రకళ, విద్యార్థిని

పోషకాహారం అందించడం మంచిదే



విద్యార్థుల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం ఇవ్వడం మంచిదే. ప్రభుత్వ పాఠశాలల్లో చాలామంది నిరుపేదలే ఉన్నారు. అలాంటి వారికి గోరుముద్దలో మంచిమంచి వంటకాలు, మూడు రోజులపాటు బెల్లం చిక్కీ, మరో మూడు రోజులు రాగిజావ ఇవ్వడం అభినందనీయం. దీంతో డ్రాప్ అవుట్స్ తగ్గుతున్నాయి.
– రమేష్‌నాయుడు, ఆర్ఆర్‌లేబర్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం

రాగి జావలో ఆయిల్ ఉండదు



రాగి జావలో ఆయిల్ శాతం అసలు ఉండదు. దీంతో కొలెస్ట్రాల్ చేరే అవకాశం ఉండదు. గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. విటమిన్ సీ, హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. ఎముకలు, దంత సంరక్షణకు ఉపయోగపడుతుంది. ఇందులో పోషకాలు, మినరల్ ఉండడం వల్ల అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. టీ, కాఫీలకు బదులుగా రాగిజావ తీసుకోవడం మంచిది. బీపీ, షుగర్ సమస్యల నుంచి బయటపడవచ్చు. జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. ఎండా కాలంలో ప్రతిఒక్కరూ రాగిజావ, రాగిముద్ద తినడం శ్రేయస్కరం. – మల్లికార్జునరెడ్డి, ప్రముఖ వైద్యుడు

ఇసుక ట్రాక్టర్ సీజ్

మంత్రాలయం రూరల్: మండలంలోని చెట్నేహళ్లి గ్రామ శివారులోని అభయాంజనేయస్వామి గుడి వద్ద తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపారు. అదే గ్రామానికి చెందిన వెంకటేష్, అయ్యప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం గ్రామ శివారులోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శనివారం నందవరం మండల కేంద్రానికి చెందిన రహతుల్లా ఆటోలో 96 (180ఎంఎల్), 96 (90ఎంల్) మద్యం బాటిళ్లు తీసుకొస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ జయరామ్‌నాయుడు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందన్నారు. ఎస్ఐ సోమశేఖర్‌రావు, సిబ్బంది ఉన్నారు.

పూలే జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

కర్నూలు(అర్బన్): ఈ నెల 11వ తేదిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఏ నాగేశ్వరరావు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసే ప్రక్రియలో భాగంగా శనివారం తమ శాఖకు చెందిన అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు అమరావతి నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారన్నారు. కార్యక్రమానికి సంబంధించి పలు విషయాలను తెలుసుకున్న ఆయన ప్రోటోకాల్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, కార్యక్రమంలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు జరగరాదని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమ నిర్వహణపై జిల్లా బీసీ సంఘాల నేతలతో డీఆర్‌ఓ సమక్షంలో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలను స్వీకరించినట్లు తెలిపారు. వేదిక ఏర్పాటు గురించి నగర పాలక సంస్థ అధికారులతో కూడా చర్చించామన్నారు. ఎలాంటి లోపం జరగకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

సామాజిక సేవకులకు సన్మానం



సేవలందించిన వారిని సన్మానించిన దృశ్యం

ఆదోని అర్బన్ : బీజేపీ ఆవిర్భావ వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో సామాజిక సేవలందించిన వారికి ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. రక్తదానంపై అవగాహన కల్పిస్తూ రక్తదానం చేసిన విరుపాక్షి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ మొక్కలు నాటే ప్రతాప్, ఆధ్యాత్మిక సంగీతవిభాగంలో సేవలందిస్తున్న అంజనేయులు, గోవులకు సేవలందిస్తున్న తరుణ్‌స్వామి, అన్నదానం చేస్తున్న నాటరాజ్‌స్వామిని సన్మానించారు. నాగరాజుగౌడ్, రమాకాంత్, వెంకటేష్, ఉరుకుంద, ముఖేష్, బాలాజీ, ఉషారాజ్ పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా మిషన్ వాత్సల్య..

తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య ఎంతో భరోసానిస్తుందని ప్రకాష్‌జైన్, జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్ తెలిపారు. 18 సంవత్సరాల్లోపు రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లల కుటుంబాలు, పిల్లలకు ఆర్థికం, ఇతరత్రా విద్యాభివృద్ధి అవసరాల నిమిత్తం దరఖాస్తులు చేసుకున్న వారికి నెలకు రూ.4 వేలు చొప్పున అందజేస్తుందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 15వ తేదీ వరకు సమయం ఉందని, అంగన్‌వాడీ, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని చెప్పారు.

పకడ్బందీగా పదవ తరగతి పరీక్షలు



మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్ ఆర్.మస్తాన్ రావు

గోనెగండ్ల: పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల స్టేట్ అబ్జర్వర్(ఫ్లయింగ్ స్క్వాడ్) ఆర్.మస్తాన్ రావు అధికారులకు సూచించారు. శనివారం పదవ తరగతి ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక (బస్టాండ్) పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను స్టేట్ అబ్జర్వర్ ఆర్.మస్తాన్‌రావు తనిఖీ చేశారు. అనంతరం జగనన్న విద్యా కానుక 4వ విడత కిట్ల పంపిణీకి తీసుకుంటున్న ఏర్పాట్లపై ఎంఈఓ వినోద్ కుమార్‌ను అడిగితెలుసుకున్నారు.

– వెల్దుర్తి: మండల కేంద్రంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం బాలుర జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ ఇందిర తనిఖీ చేశారు. ఇంగ్లీషు పరీక్షకు 824 మంది రెగ్యులర్ విద్యార్థులకు గానూ ఆరుగురు, 19 మంది ప్రైవేట్ విద్యార్థుల్లో ముగ్గురు గైర్హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి 144 సెక్షన్ అమలు చేస్తూ బందోబస్తు కొనసాగిస్తున్నారు.


అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపేయాలి



మాట్లాడుతున్న సీమ కృష్ణ

నందవరం: కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర నదిపై అప్పర్‌భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపేయాలని ఆర్‌వీఎస్ రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యుడు సీమ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాయలసీమ హక్కుల సాధనకు ఈ నెల 24న కర్నూలులో జరిగే ఒక్క రోజు నిరసన దీక్షకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి బదులు రోడ్డు కం బ్యారేజ్ నిర్మించాలని, అప్పర్ భద్ర ప్రాజెక్టును కర్ణాటక ప్రభుత్వం నిర్మించడంతో రాయలసీమకు తుంగభద్ర నది నుంచి రావాల్సిన నికర జలాలు హెచ్ఎల్‌సీ, ఎల్లెల్సీ, కేసీ కెనాల్ బైవారణి తిప్ప ప్రాజెక్టు రైతులకు రావన్నారు. వెంటనే ఆ ప్రాజెక్టు నిర్మాణం నిలిపేయాలన్నారు. శ్రీబాగ్ ఒప్పందాన్ని పూర్తిగా అమలు చేసి నీళ్ల, నిధులు, నియామకాలలో న్యాయం చేయాలని కోరుతూ నిర్వహించనున్న దీక్షలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. సమావేశంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు హరినాయుడు, నాగభూషణం, గోపాల్, సురేంద్ర రెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రన్‌ఫర్ జీసస్



రన్‌ఫర్ జీసస్‌లో క్రైస్తవులు

పత్తికొండ రూరల్: గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి మార్కెట్‌యార్డు వరకు రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని మండల పాస్టర్స్, స్థానిక సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ బంటుపల్లి శ్రీనివాసులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుమంత్‌తో పాటు పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

కోసిగి: మండలంలోని దుద్ది గ్రామంలో గొర్లి ఈరన్న (52) అనే వ్యక్తి అనారోగ్యం కారణంగా శనివారం మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయంగా రూ.10వేలు వెల్ఫేర్ అసిస్టెంట్ సంగీతమ్మ మృతుడి భార్య కిష్టమ్మకు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని నామినీ ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేష్, ఉపసర్పంచ్ కిష్టప్ప, గొర్లి ఈరేష్, లంబ తిక్కయ్య, వలంటీర్ ఆనంద్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాలను స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో సెబ్ ఎస్ఐలు సోమశేఖర్‌రావు, సుధాసాగర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. మాధవరం చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నందవరానికి చెందిన ఉబలి రహంతుల్లా ఆటోలో కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డాడు. 192 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, ఆటో సీజ్ చేసినట్లు ఎస్ఐలు తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



ఆదోని మరాఠీగేరిలో ఓ ఇంటి వద్ద స్టిక్కర్ అతికిస్తున్న దృశ్యం



కల్లుకుంటలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికిస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్ : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌యాదవ్, తాయన్న, మాధవరెడ్డి, జిలేకాబీ, రామాంజనేయులు అన్నారు. శనివారం జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమాన్ని 16,18, 19, 23, 31, 26 వార్డుల్లో నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలను సేకరించారు.

కోసిగి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. శనివారం సచివాలయం–2 పరిధిలోని కొత్తపేట, కాశమ్మ గద్దకాలనీలో ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని 19 సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహించారు. తుంబిగనూరు, కందుకూరు, సాతనూరులో పార్టీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి పర్యటించారు. సచివాలయం–1 పరిధిలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మంగమ్మ, సచివాలయం–3 పరిధిలో నాడుగేని నాగరాజు పర్యటించారు.

పెద్దకడబూరు: రాష్ట్ర ప్రజలకు నమ్మకమైన నాయకుడు జగనన్న మాత్రమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా శనివారం కల్లుకుంట, చిన్నతుంబళం, బసలదొడ్డి, తదితర గ్రామాల్లో పర్యటించారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు, జిల్లా కార్యవర్గ సభ్యులు విజేంద్ర రెడ్డి, నాయకులు రవిచంద్రారెడ్డి, గజేంద్ర రెడ్డి, పూజారి ఈరన్న పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: మండలంలోని సింగరాజనహళ్లి, పరమాన్‌దొడ్డి తండా, సుంకేశ్వరి,మాలపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, అడ్వకేట్ గురురాజరావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా సాయిబన్న దాదా గంధం

హొళగుంద: మండల కేంద్రంలోని సాయిబన్న దాదా గంధం వేడుకలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. గంధం గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి ఆదివారం ఉదయం దర్గాకు చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. గంధంలో భాగంగా శనివారం మధ్యాహ్నం నుంచి దర్గాకు భక్తులు భారీగా తరలి వచ్చి ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉరుసు, సోమవారం జియారత్ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి. కాగా దర్గా పక్కనే ఉన్న తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో నీరు నిండుగా ప్రవహిస్తుండటంతో అటువైపు చిన్నారులను వెళ్లనివ్వవద్దని పంచాయదతీ సెక్రటరీ రాజశేఖర్ సూచించారు.

అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయండి

నందవరం: ఈనెల 14న ఎమ్మిగనూరులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతికి దళితులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యాక్షుడు కనకవీడు రాజు కోరారు. శనివారం మండలంలోని హాలహర్వి, ఇబ్రహీంపురం, నదికై రవాడి, సజీవపురం, నాగలదిన్నె గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులు, కేవీపీఎస్ నాయకులు పర్యటించారు. ప్రతి పల్లెలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. మాల పూజారి నాగప్ప, సక్కరప్ప పాల్గొన్నారు.

హోరాహోరీగా గ్రామీణ క్రీడా పోటీలు



విజేత వృషభాల యజమానికి నగదు బహుమతి అందిస్తున్న దాత ఉప్పరి కిరాణం వెంకటరమణ

వెల్దుర్తి: రామళ్లకోటలో వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం కాడెద్దుల గిరక బండి లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి రామళ్లకోట మాధవస్వామి ప్రారంభించారు. 23 కాడెద్దులు పాల్గొన్న ఈ పోటీలలో కల్లూరు మండలం నాయకల్లు పంచాయతీ ఉపసర్పంచ్ షంషీర్ కాడెద్దులు విజేతగా నిలిచి రూ.20వేలు సొంతం చేసుకున్నాయి. తర్వాతి మూడు స్థానాల్లో దేవనకొండ మండలం కోటకొండ బలరాముడు వృషభాలు, వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె మనోజ్ వృషభాలు, కోడుమూరు మండలం లద్దగిరి జీఎస్ఆర్ బుల్స్ రవి వృషభాలు నిలిచాయి. వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు గెలుచుకున్నాయి. తాడు లాగు పందెంలో గ్రామానికే చెందిన చింతకాయల రాజు సత్తా చాటి రూ.3 వేల నగదు బహుమతి పొందాడు. బైక్ స్లో రేసులో చనుగొండ్ల మహేంద్ర విన్నర్‌గా నిలిచి రూ.2 వేలు, రన్నర్‌గా అదే గ్రామానికి చెందిన సురేంద్ర రూ.వెయ్యి గెలుచుకున్నారు. విజేతలకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చింతకాయల వెంకటేశ్వర్లు, దాతలు, నిర్వాహకులు బహుమతులందించారు.

గడ్డివాముల దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాములు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో శనివారం అగ్ని ప్రమాదంలో మూడు గడ్డి వాములు కాలి బూడిదయ్యాయి. రెండు ఎద్దులకు గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని లింగంపల్లి రస్తాలో రైతులు బారికి పంపా, ఇంద్ర, రవీంద్ర కల్లాలు పక్కపక్కనే ఉన్నాయి. సాయంత్రం కల్లాల్లోని గడ్డివాములకు మంటలు చెలరేగగా స్థానికులు గుర్తించి ఆర్పేందుకు యత్నించారు. రవీంద్ర కల్లంలోని ఉన్న ఎద్లను కాపాడారు. ఆలూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారమివ్వగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే గడ్డివాములు పూర్తిగా కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. దాదాపు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం కలిగిందని రైతులు పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి విప్లవాత్మక మార్పులు

తుగ్గలి: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. శనివారం ఆయన తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాల, నోవ్వీ స్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పర్యవేక్షించాలని చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులను ఆదేశించారు. కేజీబీవీని సందర్శించి తరగతి గదులు, భోజన నాణ్యతను పరిశీలించారు. కస్తూర్బాల్లో పేద విద్యార్థినులే అధికంగా ఉంటారని, సొంత పిల్లల్లా చూసుకోవాలని, రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. అర్థమయ్యేలా పాఠాలు బోధించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థినులతో ఆయన మాట్లాడి వారిచేత పాఠాలను చదివించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని, బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఆర్జేడీ ప్రతాపరెడ్డి, డీఈఓ రంగారెడ్డి, ఎస్ఎస్ఏ ఏపీఓ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంఈఓ రామవెంకటేశ్వర్లు ఉన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



హొళగుంద: సుకువాయి గ్రామంలో ఉపాధి కూలీలకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని శనివారం సీనియర్ మేటీలు స్వంత ఖర్చుతో మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ కన్నయ్య ఆధ్వర్యంలో సీనియర్ మేటీలు సురేష్, గుర్రప్ప అందజేశారు.